క్లుప్తంగా

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు



స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది

పార్వతీపురంటౌన్: మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్సై పాపారావు హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల మృతులలో ఎక్కువమంది మైనర్లే ఉన్నారన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన యజమానులపై కేసు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ వాహనాలు నడిపేటప్పుడు విధిగా బండి పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. పెండింగ్ చలానాలు, రవాణాశాఖ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠినంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు. ర్యాష్ డ్రైవింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్ వంటివాటిపై ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్రమం తప్పకుండా డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విరిగిపోయిన విద్యుత్ స్తంభాలు

- పట్టించుకోని విద్యుత్ అధికారులు



బూర్జ వద్ద విరిగిన మూడువిద్యుత్ స్తంభాలు

సీతానగరం: మండలంలోని గ్రామాలకు నిరంతర విద్యుత్ సరఫరా చేయడానికి రోడ్డుకు ఇరువైపులా వేస్తున్న 27 అడుగుల స్తంభాలు వేసిన నెలరోజులకే విరిగి పోవడంతో సరుకు నాణ్యత కొరవడిందని స్థానికులు విమర్శిస్తున్నారు. సీతానగరం మండకేంద్రం నుంచి లక్ష్మీపురం-బూర్జ మీదుగా పెదంకలాం వరకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో కన్‌స్ట్రక్షన్ డిపార్ట్‌మెంట్ రోడ్డును ఆనుకుని ఎత్తైన విద్యుత్ స్తంభాలతో విద్యుత్ తీగలు వేసే పనులు చేస్తున్నారు. బూర్జవద్ద వేసిన విద్యుత్ స్తంభాలకు వైర్లు వేయగానే విరిగి పోవడంతో రోడ్డుమీదుగా తిరుగాడుతున్న ప్రయాణికులు, వాహన చోదకులు అసౌకర్యానికి గురవుతున్నామని అంటున్నారు. విద్యుత్ స్తంభాల తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించక పోవడం వల్ల బీటీరోడ్డుకు ఆనుకుని స్తంభాలు వేయడం వల్ల ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు విరిగి పోవడానికి కారణమని అంటున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ స్తంభాల తయారీలో నాణ్యతా ప్రమాణాలు పరిశీలించాలని, రోడ్డుకు దూరంగా విద్యుత్ స్తంభాలు పాతించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులపై సమగ్రమైన దర్యాప్తు చేయాలని కోరుతున్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో 18,19 తేదీలలో రూరల్ ఎస్సై నరసింహ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీలలో ఏజెన్సీ ప్రాంతం నుంచి 32 టీమ్‌లు పాల్గొన్నాయి. అందులో దిగువ మెండంగి గ్రామస్తులు విజేతలుగా నిలిచారు. విజేతలకు ఎస్సై నరసింహమూర్తి బహుమతులు అందజేసి అభినందనలు తెలిపారు.

సీసీ కెమెరాలతో నేరాల కట్టడి



- ఏర్పాటు చేసుకోవాలని కోరుతున్న పోలీసులు
- వార్డులు, గ్రామాల్లో ప్రజలకు విస్తృత అవగాహన
- ప్రతి దర్యాప్తులో కీలకంగా ఫుటేజీ
- స్పందిస్తున్న జనం..కొనుగోలుకు అంగీకారం
- ప్రధాన కూడళ్లు, వ్యాపార కేంద్రాల వద్ద 'నిఘా నేత్రం'



పట్టణంలో ఓ ఇంటి వద్ద ఏర్పాటు చేసిన కెమెరాలు

పార్వతీపురంటౌన్:

ప్రస్తుతం రోజురోజుకూ సీసీ కెమెరాల ప్రాధాన్యం పెరుగుతోంది. పట్టణాలు, గ్రామాల్లో నేరాల నియంత్రణ, ప్రజలకు భద్రత కల్పించేందుకు సీసీ కెమెరాలు ప్రధాన భూమిక పోషిస్తున్నాయి. ఇవి ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గుతుండడంతో గ్రామీణ, పట్టణ ప్రజలు తమ నివాస ప్రాంతాల్లో వాటిని బిగించేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు పోలీస్ అధికారులు గ్రామాల్లో పర్యటించి సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పిస్తున్నారు. కేసుల విచారణలో సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు.

సీసీ కెమెరాల ఉపయోగాలు

- నేరాలను నిరోధించడం
- నేరాలను ఛేదించడం, నేరస్థులను పట్టుకోవడం
- చోరీలు, ఇళ్లలోకి చొరబడడం, దొంగతనాలను అరికట్టడం
- ప్రజలకు భద్రత కల్పించడం
- కోర్టుల్లో సాక్ష్యంగా ఉపయోగపడడం



సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

విస్తృతంగా ప్రజలకు అవగాహన

పోలీస్‌శాఖ ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అమలు చేస్తోంది. ప్రతి కేసు విషయంలో ప్రజలకు సత్వర న్యాయం అందించేలా, వారికి రక్షణ కల్పించేలా కృషి చేస్తోంది. ఈ క్రమంలో పోలీసు అధికారులు పల్లెలు, వార్డులు, గిరిజన గ్రామాల్లో పర్యటిస్తూ సీసీ కెమెరాల ఆవశ్యకతను వివరిస్తున్నారు. గ్రామాన్ని బట్టి ఎన్ని కెమెరాలు అవసరమవుతాయి, కంట్రోల్ యూనిట్ ఎక్కడ ఏర్పాటు చేయాలనే అంశాలపై వారికి తెలియజేస్తున్నారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమంటూ కేసుల ఛేదనలో వాటి ప్రాముఖ్యాన్ని ప్రజలకు లోతుగా వివరిస్తున్నారు.

జిల్లాలో కెమెరాల ఏర్పాటు ఇలా..

జిల్లాలో గుర్తించిన ప్రాంతాల్లో నేరాలు జరిగే ప్రదేశాల్లో ప్రజల సహకారంతో స్కూల్స్, కాలేజీ, బస్టాండ్, రైల్వేస్టేషన్, మత సంబంధిత ప్రదేశాలు, ముఖ్య కూడళ్లు, వ్యాపార వాణిజ్య కేంద్రాల వద్ద 347 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వాటి ద్వారా పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఇటీవల పలు కేసుల్లో సీసీ కెమెరాల సాయంతో నిందితులను పట్టుకున్నారు. ముఖ్యంగా దొంగతనాలు, చైన్‌స్నాచింగ్ నివారణలో సీసీ కెమెరాలు ఉత్తమంగా పనిచేస్తున్నాయని పోలీసులు చెబుతున్నారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం



ప్రజలకు సీసీ కెమెరాల ఉపయోగంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. నేరాలను ఛేదించడం, నేరస్తులను పట్టుకోవడంలో సీసీ కెమెరాల పాత్ర కీలకంగా ఉంది. ప్రతి ఒక్కరూ అవకాశం ఉన్నంత వరకూ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. దొంగతనాలను అరికట్టేందుకు ప్రజలు తమ వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు రావాలి. నేర నియంత్రణ, రక్షణ కల్పించేందుకు మాకు ప్రజలు సహకరించాలి.

– మురళీధర్, సీఐ, పార్వతీపురంటౌన్

పరిశోధన, నియంత్రణలో కీలకం



నేర పరిశోధన, నియంత్రణలో సీసీ కెమెరాల ప్రాధాన్యం పెరిగింది. దొంగలు, దోషులను పట్టుకోవడంలో మార్గం సుగమం అవుతుంది. ప్రస్తుతం పట్టణాలు, గ్రామాల్లో సీసీ కెమెరాలు పెడుతున్నారు. గతంలో దొంగతనాల పరిశోధన కొంత ఇబ్బందికరంగా ఉండేది. ఇప్పుడు సీసీ కెమెరాలు ఉన్న ప్రాంతాల్లో చోరీలు తగ్గుముఖం పట్టాయి. సీసీ ఫుటేజీల ద్వారా దోషులను గుర్తించి, గంటల వ్యవధిలోనే పట్టుకోగలుగుతున్నాం. ప్రజలు తమ వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు రావాలి.

– ఎస్‌వీ. మాధవ్ రెడ్డి, ఎస్పీ, పార్వతీపురం మన్యం

రోడ్డు భద్రత నియమాలు పాటించండి



బలిజిపేట: ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై సింహాచలం



పార్వతీపురంటౌన్: అవగాహన కల్పిస్తున్న ఏఎంవీఐ ఎ.వరప్రసాద్

బలిజిపేట: రోడ్డు భద్రత నియమాలను పాటించాలని ఎస్సై సింహాచలం పిలుపునిచ్చారు. ఈ మేరకు బలిజిపేటలో ఆటోడ్రైవర్స్, వాహనచోదకులకు రోడ్డు భద్రత నియమాలపై ఆదివారం ఆయన అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత నియమాలు పాటించడం వల్ల ప్రమాదాలు తగ్గే అవకాశాలుంటాయన్నారు. ఆటోలలో నిబంధనలకు లోబడి ప్రయాణికులను ఎక్కించాలని చెప్పారు. ఎక్కువ మందిని ఎక్కించి ఆటోలను నడపరాదని హితవు పలికారు. డ్రైవర్ పక్కన ఎవరినీ కూర్చోపెట్టవద్దన్నారు. ఓవర్‌లోడ్ ప్రమాదాలకు హేతువులని తెలిపారు. అదేవిధంగా వాహనచోదకులు వాహనాలను జోరుగా నడపడం వల్ల ప్రమాదాలు సంభవిస్తాయని, మైనర్లకు వాహనాలను ఇవ్వరాదన్నారు. హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలని సూచించారు. తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది, ఆటో వర్కర్స్, వాహనచోదకులు పాల్గొన్నారు.

అధిక లోడ్ వాహనాల్లో ప్రయాణాలు వద్దు

పార్వతీపురంటౌన్: హెల్మెట్ విధిగా ధరించాలని ఏఎంవీఐ ఎ. వరప్రసాద్ అన్నారు. జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా సంక్రాంతికి సొంత ఊళ్లకు విచ్చేసిన ప్రజలు తిరుగు ప్రయాణంలో ఉన్నవారికి ఆదివారం పార్వతీపురం శివార్లలో రవాణా శాఖ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గమ్య స్థానాలను తొందరగా చేరుకోవాలనే ఉద్దేశంతో అధిక ప్రయాణికులతో వెళ్తున్న ఆటోలు, మ్యాక్సీ క్యాబ్‌లు, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించరాదని సూచించారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపరాదని హితవు పలికారు. ఇద్దరు కంటే ఎక్కువ మందితో ద్విచక్ర వాహనం నడపరాదని పేర్కొన్నారు. కుటుంబ భద్రత గుర్తు పెట్టుకోవాలని చెప్పారు. రహదారిపై సురక్షిత నిబంధనలు పాటించాలని కోరారు. ప్రతి క్షణం జాగరూకతతో ఉండాలని, ప్రాణాలు అమూల్యమని చెప్పారు. కార్యక్రమంలో ఆర్టీఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా రాష్ట్ర పర్యటన రద్దు చేయాలి



డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు

పార్వతీపురంటౌన్: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపరిచిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఏపీ పర్యటనను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బీవీ రమణ అన్నారు. ఈ మేరకు ఆదివారం పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పట్టణంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యున్నత పార్లమెంట్‌లోనే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌కు అవమానం జరిగిందని, అంతటి అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన హోంమంత్రి అమిత్ షా తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు టి.జీవా, సీపీఎం నాయకులు గొర్లి వెంకటరమణ, పి.రాజశేఖర్, బి.సూరిబాబు, పాకల సన్యాసిరావు, సీపీఐఎంఎల్ నాయకులు పి.రమణి, బి.నరసింగరావు, భాస్కర రావు, పి.సంఘం, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పి.రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా కంకర తవ్వకాలు

- పట్టించుకోని అధికారులు



బంద వద్ద జేసీబీతో తవ్వి ట్రాక్టరుకు ఎక్కిస్తున్న కాంట్రాక్టర్లు




రియల్ ఎస్టేట్‌లో వేసి చదునుచేస్తున్న దృశ్యం

బలిజిపేట: మండలంలో అక్రమంగా కంకర తవ్వకాలు జోరుగా సాగుతున్నా రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోవడం లేదు. బందలలో కానీ, జిరాయితీ భూమిలో కానీ తవ్వకాలు జరపాలంటే స్థానిక తహసీల్దార్ అనుమతులు అవసరం. అక్రమంగా తవ్వకాలు జరిపి బాహాటంగా రియల్ ఎస్టేట్ భూములలో వేసి చదును చేసుకుంటున్నా పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. అక్రమంగా కంకర తవ్వేవారిపై కఠిన చర్యలు చేపడతామని ప్రభుత్వం హెచ్చరిస్తున్నా బాహాటంగా అక్రమ తవ్వకాలు చేయడంలో ఆంతర్యం ఎవరికి అంతుపట్టడం లేదు. ప్రభుత్వ నిబంధనలు బేఖాతరుచేస్తూ అక్రమ తవ్వకాలు చేస్తున్నవారికి అధికారులు కొమ్ముకాస్తున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రత్యేకించి ఆదివారం రోజున ఈ విధంగా అక్రమ తవ్వకాలు చేపట్టడం వెనుక ఆంతర్యం ఏమిటనేది ప్రశ్నార్థకంగా ఉంది. బలిజిపేట మండలంలోని చెల్లింపేట వెళ్లే మార్గంలో బందల వద్ద అక్రమంగా కంకర తవ్వి చిలకలపల్లి సమీపంలో ఉండే రియల్ ఎస్టేట్ భూమిలో వేసి చదునుచేస్తున్నా పట్టించుకోకపోవడం దారుణంగా ఉంది. జేసీబీలతో బందలలో గుమ్ములు పెట్టి గ్రావెల్ తీయడం వల్ల ఆ గుమ్ములు ప్రమాదకరంగా మారుతున్నాయని గ్రామాలకు చెందిన ప్రజలు వాపోతున్నారు. వీటిని రెవెన్యూ అధికారులు కానీ, మైనింగ్ అధికారులు కానీ పట్టించుకోకపోవడంతో అక్రమ తవ్వకాల జోరు ఎక్కువగా సాగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై తహసీల్దార్ రత్నకుమారిని వివరణ కోరగా కంకర తీసేందుకు అనుమతులు తీసుకోవాల్సి ఉందని, ఎవరూ ఎటువంటి అనుమతులు తీసుకోలేదన్న విషయం తన దృష్టికి రాలేదన్నారు. దీనిపై తగు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ ఎక్స్ఛేంజ్‌లకు మరమ్మతులు చేపట్టాలి



నిడగల్లులో నిరుపయోగంగా బీఎస్ఎల్ ప్యానల్ బోర్డు



శిథిలావస్థలో బీఎస్ఎన్ఎల్ ఎక్స్ఛేంజ్ భవనం

సీతానగరం: అధిక మొత్తంలో రెవెన్యూ వచ్చే బీఎస్ఎన్ఎల్ ఆధ్వర్యంలో నిర్వహించే టెలిఫోన్, నెట్‌సర్వీసులు పనిచేయని వాటిని పునరుద్ధరించి ఆదుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి విద్యావంతులు, వృత్తి పనివారు తదితర వివిధ రకాల వృత్తిపరమైన పనుల నిమిత్తం జీవనోపాధి కోసం విజయవాడ, హైదరాబాద్, వరంగల్, గుంటూరు, ఏలూరు, సికింద్రాబాద్, రాయ్‌పూర్, బిలాస్‌పూర్, న్యూఢిల్లీ, చెన్నై ప్రాంతాల్లో దశాబ్దాల కాలంగా కుటుంబాలతో ఉంటున్నారు. ఆయాకుటుంబాల్లో కొంతమంది స్వగ్రామాల్లోనే నివసిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి దూరప్రాంతాల్లో ఉన్న కుటుంబీకులతో యోగక్షేమాలు తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం బీఎస్ఎన్ఎల్ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు మండలకేంద్రంలోని 800 కనెక్షన్లతో ఎక్స్ఛేంజ్‌ను ఏర్పాటు చేసింది. అలాగే బూర్జ, నిడగల్లు, బగ్గందొరవలస గ్రామాల్లో టవర్‌లతో ఎక్స్ఛేంజ్‌లు ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రజలకు మొబైల్ ఫోన్‌లు అలవాటైనంతవరకూ గణనీయంగా పనిచేసిన టవర్లు, ఎక్స్ఛేంజ్‌లు ఒక్కసారిగా మూలకు చేరడం వల్ల ఫోన్‌లు మొరాయించడం, ల్యాండ్‌ఫోన్లు ఇళ్లలో అలంకారప్రాయంగా ఉండిపోయాయి. ఆయాగ్రామాల్లో అద్దెకు తీసుకున్న భవనాల్లో లక్షలాది రూపాయల విలువైన మెటీరియల్ విషయమై పట్టించుకోలేదని ఆరోపణలు వస్తున్నాయి. ప్రైవేట్ నెట్‌వర్క్‌లను రోజురోజుకూ చార్జీలు పెంచడంతో ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తోందని అంటున్నారు. ఫోన్ వినియోగంలో ప్రజలు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా బగ్గందొరవలస, బూర్జ, నిడగల్లు, సీతానగరంలలో బీఎస్ఎన్ఎల్ ఎక్స్ఛేంజ్ భవనాలకు మరమ్మతులు చేసి బీఎస్ఎన్ఎల్ సేవలు అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

అపరాలకు తెగుళ్ల బెడద

- తొలిదశలోనే పంటలపై దాడి
- మందులు పిచికారీ చేస్తున్న రైతులు
- పార్వతీపురం నియోజకవర్గంలో 4578 ఎకరాల్లో అపరాల పంట



పార్వతీపురం మండలంలో అపరాల సాగు

పార్వతీపురంటౌన్:

తక్కువ పెట్టుబడితో ఆశాజనకమైన ఉత్పత్తులు సాధించే అపరాల పంటపై ఆదిలోనే తెగుళ్లు దాడి చేస్తున్నాయి. ఏటా అపరాల పంటలో వచ్చే ఆదాయం కంటే తెగుళ్ల నివారణకు పెట్టే ఖర్చే అధికంగా ఉంటోందని రైతులు వాపోతున్నారు. గిరిజన ప్రాంతంలో మినుము, పెసర పంటలు ఎకరాకి మూడు నుంచి నాలుగు క్వింటాళ్ల దిగుబడి వస్తుండగా తెగుళ్లు, ప్రతికూల వాతావరణంతో మెట్టలో కనీసం ఒకటి నుంచి రెండు క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీనికి తోడు ఈ ఏడాది ఖరీఫ్ చివరిలో సంభవించిన తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు అపరాల పంట కొంతమేర దెబ్బతింది. కాగా పండించిన పంటకు రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మెట్టలో అపరాలపై ఆసక్తి

మెట్ట ప్రాంతమైన బలిజిపేట, సీతానగరం మండలాల్లో కొన్ని గ్రామాల్లో సాగునీటి లభ్యత తక్కువగా ఉండడంతో ఖరీఫ్‌లో వరి, అపరాల పంటను సాగు చేయడం పరిపాటి. రబీలో సాగుచేసే ఆపరాల పంటలకు తెగుళ్లు, చీడపీడలు, కలుపు బెడద ఎక్కువగా ఉంటుంది. వాతావరణంలో సంభవిస్తున్న అసమానతలతో పాటు నిస్సారమైపోతున్న భూమి కారణంగా ఏటా పెట్టుబడి పెరిగి పోతోంది. అపరాల ధరలు కూడా ఏటా తగ్గిపోతుండడంతో రైతులు నిరాశకు గురవుతున్నారు. ఈ ఏడాది పార్వతీపురం నియోజకవర్గం పరిధిలో 4578 ఎకరాల్లో రైతులు అపరాలు సాగు చేశారు. ప్రస్తుతం పంటలు ప్రాథమిక దశలో ఉన్నాయి. రెండు, నాలుగు ఆకులదశలో ఉన్న పంటకు ఆకుదొలిచే, ఆకుముడత, పురుగు తెగుళ్లు ఆశిస్తుండడంతో మందులు పిచికారీ చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

నియోజకవర్గంలో అవరాల సాగు ఇలా..

మండలం	సాగు ఎకరాల్లో
పార్వతీపురం	1050
సీతానగరం	1516
బలిజిపేట	2012

వ్యవసాయాధికారుల సూచనలు

అపరాల పంట రెండు, నాలుగు ఆకుల దశలో ఉన్నప్పుడు పచ్చపురుగు వ్యాప్తి చెందడం పరిపాటి అని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఈ దశలో వేపనూనె లీటరు నీటికి 5 మిల్లీలీటర్ల చొప్పున కలిపి పిచికారీ చేస్తే నెలరోజుల వరకూ తెగుళ్లు వ్యాప్తి చెందవు. ఇప్పటికే తెగుళ్లు సోకితే క్లోరిపైరిఫాస్ మందును లీటరు నీటికి 2.5 మిల్లీ లీటర్లు లేదా లీటరు నీటికి మోనోక్రోటోపాస్ 1.6 మిల్లీ లీటరు చొప్పున కలిపి పిచికారీ చేస్తే తెగుళ్లను అదుపు చేయవచ్చని తెలియజేస్తున్నారు. తెగుళ్ల తీవ్రత ఎక్కువగా ఉంటే ఎసిఫేట్ లీటరు నీటికి ఒక గ్రాము లేదా డైమెథోయేట్ 1.5 మిల్లీలీటరు మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే మంచి ఫలితాలు ఉంటాయని చెబుతున్నారు.

సస్యరక్షణ చర్యలతో మేలు



వ్యవసాయాధికారుల సూచనల మేరకే రైతులు అపరాల సాగులో క్రిమి సంహారక మందులు వాడాలి. అనవసర మందుల వాడకంతో అదనపు ఖర్చుతో పాటు భూసారం దెబ్బతినే అవకాశం ఉంది. మెరుగైన సస్యరక్షణ చర్యలతోనే మంచి దిగుబడులు వస్తాయి. భూమిలో నీటి లభ్యత అనుకూలంగా ఉండడంతో పంటను జాగ్రత్తగా కాపాడుకుంటే పంటకు నష్టం వాటిల్లదు.

– అశోక్, వ్యవసాయ శాఖాధికారి, పార్వతీపురం

వాహన చోదకులు జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న ఎస్సై ఎం.రాజేష్

సీతానగరం: వాహన చోదకులు రోడ్డుపై వాహనాలతో రాకపోకలు నిర్వహించే ముందు నిబంధనలు పాటించాలని ఎస్సై ఎం.రాజేష్ అన్నారు. మండల కేంద్రంలోని రాష్ట్ర రహదారిలో హనుమాన్ జంక్షన్ వద్ద ద్విచక్ర వాణాలు నడుపుతున్నవారికి, ఆటోడ్రైవర్లకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు ఆటోడ్రైవర్లు ప్రయాణికులను ఎక్కించడానికి నిబంధనలు పాటించాలని, రోడ్డుకు ఇరువైపులా వాహనాల రాకపోకలను పరిశీలించాలని కోరారు. ఆటోడ్రైవర్ సీటుకు పక్కన ఎవరు కూర్చున్నా కేసు నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. అందుకు నిఘానేత్రాలను ప్రతిరోజూ పరిశీలించి చర్యలు చేపడతామని చెప్పారు. అలాగే ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వ్యక్తి విధిగా లైసెన్స్ పొంది ఉండాలని, మైనర్లు వాహనాలు నడపడం నేరమని గుర్తించాలని స్పష్టం చేశారు. రోడ్డుపై వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్సై ఎల్.శ్రీనివాసరావు, హెచ్‌సీ తిరుపతిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సాలూరు మున్సిపాలిటీలో ప్రజాసమస్య వేదిక

మక్కువ: సాలూరు మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం గిరిజనశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆధ్వర్యంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో డీడీ స్వరూపారాణి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలస్థాయి అధికారులంతా సోమవారం ఉదయం 9.30గంటలకు సాలూరు మున్సిపాలిటీ కార్యాలయానికి హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్‌బిల్లులు చెల్లించాలి

స్థానిక విద్యుత్‌సబ్‌స్టేషన్ వద్ద సోమవారం బిల్‌కలెక్టర్ అందుబాటులో ఉంటారని, వినియోగదారులు విద్యుత్‌చార్జీల బిల్లులు చెల్లించుకోవచ్చునని ఏఈ జోగినాయుడు ఆదివారం తెలిపారు.

సూపరింటెండెంట్ పోస్టును భర్తీ చేయాలి

పార్వతీపురంటౌన్: పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన ఉప సంచాలకుల(డీడీ) విభాగంలో ఖాళీగా ఉన్న సూపరింటెండెంట్ పోస్టును భర్తీ చేయాలని గిరిజన సంఘం నాయకుడు పల్ల సురేష్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ గురుకులం సూపరింటెండెంట్ (ఓఎస్డీ) ఆ విభాగంలో గతంలో పనిచేసిన ఉద్యోగి పదవి విరమణ అయిన తరువాత సంవత్సరాల గడిచినా ఇంతవరకు ఎవరినీ నియమించలేదన్నారు. గురుకులాలకు సంబంధించిన అధికారిని పూర్తి స్థాయిలో నియమించాలని గిరిజన విద్యార్థి సంఘం తరఫున కోరుతున్నామన్నారు.